# నమ్మదగిన మాట

[గల్పిక]

గోపాలానికికొక పెద్ద ధర్మసందేహం పట్టుకుంది—ఆసినిమా ట్రూపులో బొంబాయి వెళ్ళిన తన తమ్ముడు పార్వతీశం ఎవతెనన్నా తగులుకున్నాడా, లేదా?

తన తమ్ముడి నైతికక్షేమంతో గోపాలాని కేం పనో ఊహించటం కష్టం. తమ్ముడు ఎవతెనన్నా తగులుకున్నాడని రుజువైతే తన కెక్కువ తృప్తో, నీతిగా ఉన్నాడంటే ఎక్కువ తృప్తో గోపాలానికే తెలీదు.

గోపాలానికి ఒక్కటే తెలుసు: పార్వతీశాన్ని తను పెంచి పెద్దవాణ్ణి చేశాడు, చదువు పూర్తిగా చెప్పించాడు; ఒక ఇంటి వాణ్ణి చెయ్యటం మాత్రమే తనమీద ఉంది. ఈపరిస్థితుల్లో పార్వతీశం ఇప్పుడే కోతికళలు పోవటం జరిగితే, ఏనిక్షేప మంటి పిల్లనో తెచ్చి వాడికంట గట్టటం తనవల్ల ఒక్కనాటి కూడా జరగదు!

తన తమ్ముడిమీదకంటె, గోపాలానికి, ఆతమ్ముడికి ముడి పెట్టబోయే పిల్లమీద ఇంత అభిమానం దేనికో అదికూడా మనం సులభంగా ఊహించలేం.

ఏమైనా పార్వతీశం ప్రవర్తనను గురించి స్పష్టంగా తెలుసుకునేదాకా గోపాలానికి నిద్రపట్టే లక్షణాలు కనిపించలేదు.

అసలేసినిమాకంపెనీ! అందరూలఫూటుగాళ్లు చేరతారు. ఆపైన ఆడవాళ్లూ మగవాళ్లూకలిసి చైతక్కలాట్టం! ఆముండలన్నా సంసార్లా అంటే—సంసార్లు హాయిగా మొగుళ్ళకు

వంటచేసిపెడుతూ పిల్లల్నికనక సినిమాల్లో కెందుకుపోతారు?

పార్వతీశం వెంట తమగ్రామంనించి ఇంకా అయిదారుగురు వెళ్ళారు. అసలా సినిమా తీసినకంపెనీ ఆవూరివాళ్ళదే. అందుకని గోపాలం నలుగురిదగ్గిరా ఆరా తియ్యటానికి బయల్దేరాడు.

"ఏమోయ్, లక్ష్మీనారాయణా? నువ్వుకూడా బొంబాయి వెళ్ళావుగామల్లు. ఏమిటి కబుర్లు? మాతమ్ముడు, పార్వతీశం, ఒళ్లుదగ్గిర పెట్టి మసులుకున్నాడా?" అన్నాడు గోపాలం.

"వొళ్లు ఎవరిదగ్గిర పెట్టి?" అన్నాడు లక్ష్మినారాయణ విచక్షణగా.

తాగుబోతు వెధవ! వాణ్ణి అడగటం తనదేపొరపాటు!

"ఏమండీ, కృష్ణశాస్త్రిగారూ? మీరంతా కలిసే ఉన్నారుగానూలు. మాతమ్ముడు, పార్వతీశం, ఆడవాళ్లు జోలికేమీ పోలేదుకద?"

"ఎబ్బే. అటువంటి దేమీ ఉన్నట్టు లేదు లెండి. నాకతనితో ఆటే పరిచయం కలగలేదుగాని—వస్తాను!"

ఎందుకు చెబుతాడూ? అంతా తోడుదొంగలు!

"ఏమోయ్, సూర్యం మావాడు బొంబాయిలో భటాచోరుముండల్నెవర్నీ తగులుకోలేదుగద?"

"ఓరహస్యం చెప్పనా? మళ్లీ ఎవరితోనన్నా అనేరు! నేను తలుపుకంతల్లోనించి చూశాగాని, నాకేమీకనిపించలా, చీకట్లో! తెలీనిమాట చెప్పి ఎట్లా పాపం కట్టుకునేదీ!"

వీడో దొమ్మరముండాకొడుకు! చిన్నంతరమూ పెద్దంతరమూ ఎరగడు!

ఇంత శ్రమపడి ఆముండదగ్గిరికిపోయి అదేమంటుందో ఆ సంగతికూడా తెల్సుకొంస్తే సరిపోతుందిగా!

గోపాలం ప్రాణా లరిచేతిలో పట్టుకొని దానిఇల్లు విచారించుకుంటూ వెళ్ళాడు.

పొద్దూకిం దప్పుడే. "కూర్చోండి, పంతులుగారూ?" అంటూ అది తనఎదటే చీరవిప్పి మరోచీర కట్టసాగింది.

"అయితే—ఇదుగో—చూడూ! నీపేరేమిటో? మీావెంట పార్వతీశమని ఒక కుర్రాడొచ్చాడే! వాడు మీాతో వచ్చిన ఆడవాళ్ళ నెవర్నన్నా మరిగాడా?"

"ఆ అబ్బాయి అటువంటివాడయితే నేనొదిలిపెడతానుటండీ, పంతులుగారూ?...వెళుతున్నా రేం? రాత్రికుండరూ?"

అదురుతున్న గుండెతో గోపాలం బయటపడ్డాడు. తన తమ్ముడిశీలం చెడలేదని రూఢిఅయిందిగాని, అందువల్ల కలగదగిన సంతోషంమాత్రం గోపాలానికి కలగలేదు.

———